


# మసిగుడ్డ - కుప్పిలి పద్మ

*(జనవరి 1994 ఆదివారం ఆంధ్రజ్యోతి)*

పది నిమిషాల్నుండి బీరువా అంతా గాలించినా ఓ పాత గుడ్డముక్క దొరకలేదు.

మసిగుడ్డ లేక వంటింట్లో పని చెయ్యాలంటే నానా అవస్థగా ఉంది. పాత మసిగుడ చినిగి పీలికలై పనికిరాకుండా పోయి నాలుగైదు రోజులవుతోంది. మరోటి వెతికి పెడదాం అనుకోవటమే కాని అశ్రద్ధతో కుదరక పాతదానితోనే ఉదయం అన్నం వారుస్తుంటే అది సరిపోక చెయ్యి చురుక్కుమంటే కాని కొత్త మసిగుడ్డ కోసం అన్వేషణ మొదలు కాలేదు.

చివరికి పాతబట్టల మూట విప్పాను. గట్టివి కొన్ని రంగులు వెలిసిపోయినవి, పొట్టి అయినవి, బిగుతైపోయినవి, స్టీలు సామానువాడికి వేద్దామని ఉంచినవి.

వెతగ్గా వెతగ్గా మసిగుడ్డకి పనికొచ్చే బట్ట కనిపించింది. రంగు తగ్గలేదు. కాని మెడ దగ్గర కాస్త పిలికిపోయిన జాకెట్టు కనిపించింది.

అమ్మ జాకెట్టు.

పోయినసారి అమ్మ వచ్చినప్పుడు మర్చిపోయిన జాకెట్టు.

జాకెట్టు తీసుకుని వంటింట్లోకి వెళ్ళి సౌకర్యవంతంగా పనులు చేసుకోవటం మొదలుపెట్టాను.

ఆ జాకెట్టు చూస్తుంటే అమ్మ గుర్తొస్తూంది. ఏ చీరమీద జాకెట్టో!

కాలింగ్ బెల్ నవ్వడి.

తలుపు తీశాను.

జానకి!

ఇదే కాలనీలో ఉంటారు. మచిలీపట్నం వాళ్ళు. ఆమె శ్రీవారు ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి. ఇద్దరు పాపలు, ఒక బాబు.

ఇంటిపని, వంటపనితోనే జానకి ఎప్పుడు సతమతమౌతుంటుంది తప్ప ఎప్పుడో కాని ఇలా ఎవరింటికి రాదు - ఏదైనా పనుంటే తప్ప.

కుశల ప్రశ్నలు అయ్యాక "నాక్కాస్త రోజూ ఇంగ్లీష్ నేర్పిస్తారా?" అడిగింది జానకి.

వైర్ బ్యాగ్ అల్లటం నేర్పిస్తారా? స్వెట్టర్ ఎలా అల్లాలి? మ్యాంగో జ్యూస్ ఎలా చెయ్యాలి? అనేవాళ్ళనే ఇంతవరకు మా కాలనీలో చూడటం వలన జానకి కోరిక కొత్తగా తోచింది.

"నేర్పిస్తాను. కాని మీకు తీరికేది" అన్నాను.

"ఓ పూట వండటమైనా మానెయ్యాలి. కాని ఇంగ్లీషు నేర్చుకొనటం మానకూడదు" అంది జానకి.

"ఏం?" కుతూహలంగా అడిగాను.

"మా పిల్లలు నన్నసలు లక్ష్యపెట్టటం లేదండి. ఏం అడిగినా పట్టించుకోరు. తండ్రి ధ్యాసే. వాళ్ళు అడిగినవి చెప్పే ఓపిక, తీరిక ఆయనకి లేవు. నాకా వాళ్ళ సందేహాలు తీర్చేంత చదువులేదు. అందుకే బి.ఏ కడదాం అనుకుంటున్నా. కనీసం చిన్న పాప, బాబు చదువు విషయమైనా శ్రద్ధ తీసుకోవాలండి. ఏంటో నిన్నటివరకు మన కొంగు పట్టుకు తిరిగిన పిల్లలు ఈ రోజు మనకేం తెలియదని నిర్లక్ష్యం చేస్తుంటే బాధగా ఉందండి" అంది జానకి.

వారం రోజుల క్రితం మా పాప సమ్మర్ కంప్యూటర్ క్లాసుకి వెళ్ళొచ్చింది. "ఏం చెప్పారే?" అంటే 'నీకు కంప్యూటర్ రాదుగా' అంటూ తండ్రి కోసం ఆత్రంగా ఎదురు చూసింది. తండ్రింటికి రాగానే చిలకలా ఏంటేంటో చెప్పింది.

జానకి ఇంగ్లీషు నేర్చుకుంటానన్నట్టు నేనిప్పుడు కంప్యూటర్ గురించి తెలుసుకోవాలా? నేర్చుకోవాలా?

"అలాగే రండి. నేర్పుతాను" అన్నాను.

జానకి వెళ్ళిపోయాక వంటింట్లోకి వెళ్ళి పనులు చేస్తున్నా జానకి మాటలే గుర్తొస్తున్నాయి.

అమ్మ!

ప్రాణానికి ప్రాణమిచ్చి జన్మనిచ్చే అమ్మని లక్ష్యపెట్టటానికి అమ్మకీ అర్హతలు కావాలా? కావాలని కాదు కాని అమ్మని ఎదిగే పిల్లలు నిర్లక్ష్యం చేయటం సర్వసాధారణం కదా!

నాకు బాగా గుర్తు...

ఇప్పుడు అమ్మలు అవుతున్నవాళ్ళకి డిగ్రీలుండి, కొద్దో గొప్పో ఆర్థిక స్వాతంత్ర్యం ఉంది కాని మా అమ్మల కాలంలో డిగ్రీలు ఉన్నవాళ్ళు చాలా తక్కువ.

ఇప్పటి తల్లుల్లా అప్పట్లో అమ్మలకి పిల్లల్ని దగ్గర కూర్చోపెట్టుకుని హోమ్ వర్క్ చేయించటం తెలిసేది కాదు.

ఓపిక ఉన్న తండ్రులో, ప్రైవేటు మాస్టర్లో, ఇంట్లో చదువొచ్చిన చిన్నాన్నలో, మామయ్యలో హోమ్‌వర్క్ చేయించేవారు, సందేహాలు తీర్చేవారు.

ఓసారి స్కూల్ ఫస్ట్ వస్తే ఓ కప్ బహుమతిగా ఇచ్చారు.

ఫంక్షన్ నుండి ఇంటికి వచ్చేసరికి వాకిట్లో అమ్మ ఎదురై "ఏమిచ్చారని" కుతూహలంగా అడుగుతుంటే ఆమె మాట వినిపించుకోకుండా ఎక్కడో లోపల పడుకుని పేపర్ చదువుకుంటున్న నాన్నగారి దగ్గరికి పరిగెత్తుకెళ్ళి కప్ చూపించాను.

అలా చెయ్యటం అమ్మని నిర్లక్ష్యం చేయటమని కాని, అమ్మ బాధపడుతుందని కాని అప్పట్లో నాకు తెలియదు.

పక్కలు తడిపినా, అర్ధరాత్రి ఏడిస్తే మంచి నిద్రలో ఉన్నాసరే లేచి ఎత్తుకు తిప్పి నిద్రపుచ్చటం, ఊరంతా తిప్పి తిప్పి గోరుముద్దలు తినిపించటం, కారే ముక్కుని తుడవటం, ఒళ్ళు వెచ్చబడితే రేయింబగళ్ళు సేవ చేయటం అమ్మ పనులు.

సేవలు చేసి చేసి తమ శరీరాల రూపురేఖలే పోగొట్టుకునే అమ్మలు ఒక్కరా ఇద్దరా? అసలు లెక్కించగలనా?

పెద్దపాప పసితనంలోనే హాయినిచ్చే తలస్నానాన్ని మర్చిపోయాను. పిల్లని నిద్రపుచ్చి 'హమ్మయ్యా' అనుకుంటూ స్నానానికి ఇలావెళ్ళేదాన్నో లేదో, ఎవరో కొట్టి లేపినట్టు గుక్కపెట్టి ఏడుపు. ఇంకేం స్నానం? రెండు చెంబులు అటూ ఇటూ గుమ్మరించుకుని ఊరడించేసరికి జడ అల్లుకోవాలనే ధ్యాసే ఉండేది కాదు.

పక్కింటి టీచరమ్మ పిల్లలు పుట్టకముందు గంజిపెట్టిన నేత చీరలు, వెంకటగిరి చీరల్ని కుచ్చిళ్ళు వొద్దిగ్గా పెట్టి ఎంచక్కా బుట్టబొమ్మలా ముస్తాబయ్యేది.

ఇప్పుడో పిల్ల పనులు, వంటపని, మొగుడికి వడ్డించి తను తినీ తినకా, అతగాడికి టిఫిన్ బాక్స్ సర్ది, పిల్లకి తినిపించి, ఆ పిల్లకి కావాల్సినవి బుట్టలో సర్ది చీరకి జాకెట్టు సరిపోయిందో లేదోననే ఆలోచనే లేకుండా జారిపోయే నైలెక్స్ చీరని పిన్నులతో బంధిచేస్తూ ఆ పిల్లని క్రచ్ లో దింపి హడావుడిగా అటెండెన్స్ రిజిష్టర్ లో సంతకం చేయటంతోనే రోజూ తెల్లారిపోతుంది.

"ఎక్కడికైనా వెళ్ళినప్పుడో, పేరంటానికి వెళ్ళినప్పుడో కట్టుకుందామన్నా ఎక్కడ కుదురుతుంది? ఈ పిల్లలని ఎత్తుకోవాలిగా? నిమిషంలో నలిగిపోతాయి. నాకా నైలెక్స్ చీరలంటే చికాకు. అయినా అవే కట్టుకోవాలి" అంటూ ఎన్నోసార్లు వాపోయింది.

నాన్నలెందుకు ఎత్తుకోరో?

ఆ మధ్య 'స్త్రీల హక్కుల'పై సభ జరుగుతుంటే వెళ్ళాను. స్త్రీల హక్కుల గురించి ఎంతో ఆర్తిగా వ్యాసాలు రాసే ఆయన భార్య, ఉపన్యాసాలిచ్చే ఆయన భార్య, గుమస్తాగారి భార్య ఒకరనేంటి పిల్లల్ని తల్లులే మోస్తున్నారు.

కన్నతల్లి మాత్రమే అన్నిపనులు చెయ్యాలని మగవాడు అనుకుంటాడు.

పిల్లలూ అనుకుంటారు.

ఎందుకు చెయ్యాలని పాప మా అమాయకపు తల్లి మాత్రం అనుకోదు.

నే కావాలని నిన్ను నిర్లక్ష్యం చేయలేదని అమ్మకి ఇప్పుడు చెపితే?

ఏముంటుంది?

నవ్వుతుంది లాలనగా.

కాలింగ్ బెల్ మోగింది.

తలుపు తీశాను.

ఎదురింటి అరుణ.

"మూడవుతోంది. మీరింకా రాలేదేంటాని నేనే వచ్చాను" అంది. అప్పుడే మూడయిందా! రోజూ మేమిద్దరం స్కూల్ కి పోయి నా చిన్నకూతుర్ని, తన కొడుకుని తీసుకొస్తాం. ఈ రోజు ఆలోచనలతో అసలా సంగతే మర్చిపోయాను.

"వస్తున్నానొస్తున్నా" అంటూ చెప్పులేసుకుని తాళం పెట్టి ఉన్నపళంగా బయలుదేరాను.

ఇప్పుడైతే చీర బాగుందా - జుట్టు రేగిందా - ముఖానికి పౌడరుందా అనే పట్టింపు లేదు. కాని చదువుకునే రోజుల్లో ఇలా ఎప్పుడైనా బయటికి వెళ్ళేదాన్నా? ఒకటికి పదిసార్లైనా అద్దంలో ముఖం చూసుకుని కాని వెళ్ళేదాన్ని కాదు.

తన శరీరం గురించి పట్టించుకోకుండా నలిగిన చీరతో, రేగిన జుట్టుతో తిరిగే అమ్మని చూస్తుంటే బోల్డంత చికాకేసేది.

ఇప్పుడు నా అవతారాన్ని చూసి మా పెద్దమ్మాయి ఎన్నిసార్లు విసుక్కోలేదూ!

త్వరత్వరగా నడుస్తున్న నేను అరుణ వెనకబడటంతో ఆగి వెనక్కి తిరిగి "ఏంటంత మెల్లగా నడుస్తున్నారు?" అడిగాను.

"కాలు బెణికింది" అందామె.

"ఎప్పుడు? ఎలా? ఏమైనా రాశారా?" అడిగాను.

"సైకిల్ మీదనుంచి పడ్డాను, ఇదంతా చెక్కుకుపోయింది" అంటూ మోచేయి చూపించింది.

"సైకిలా?" అయోమయంగా అడిగాను.

"ఆం వచ్చే ఏడాది పిల్లల్ని సెంటాన్స్ లో చేర్పిద్దాం అనుకుంటున్నాం. చాలా దూరంగా. రెండుపూటలా రిక్షా అంటే చాలా ఖర్చు. అదీకాక పెద్దది సంగీతంలో చేరింది. రోజూ క్లాసుకి వెళ్ళిరావాలంటే కష్టంగా ఉంది. ఏదైనా చిన్నబండి కొనుక్కుంటే పిల్లల్ని స్కూల్లో దింపొచ్చు. పాపని సంగీతం క్లాసుకి తీసుకువెళ్ళొచ్చు. నాకా సైకిలే రాదు. సైకిలొస్తే బండిని తేలిగ్గా బ్యాలెన్స్ చేయొచ్చంట. అందుకే తెల్లారే గ్రౌండుకి వెళ్ళి సైకిల్ నేర్చుకుంటున్నాను. ఈ వేళ ఉదయం కిందపడ్డాను" అని అరుణ చెపుతుండగా స్కూలొచ్చింది. పిల్లల్ని తీసుకుని ఇంటికొచ్చాం.

సాయంత్రం ఇంటికొచ్చినప్పట్నుంచి పెద్దాడి ముఖంలో కళే లేదు. 'ఏమ్మా అలా ఉన్నావ్' అంటే 'బానే ఉన్నానని' పేలవంగా అంటాడు తప్ప విషయం చెప్పడు.

పెద్దమ్మాయి మాత్రం కాలింగ్ బెల్ మోగిన ప్రతిసారి ఒక్క గెంతు గెంతి మరీ తలుపు తీసి వచ్చినవాళ్ళని చూసి ఆరిపోయిన నవ్వు ముఖంతో వెనక్కొస్తుంది. వీధిలోకి ఇంట్లోకి కాలు కాలిన పిల్లిలా తిరుగుతోంది. "ఏంటమ్మా! హుషారుగున్నావ్" అంటే "ఏం లేదే" అంటుంది తప్పా తనూ ఏ సంగతీ చెప్పలేదు.

ఏడవుతుంటే కాలింగ్ బెల్ మోగగానే తలుపు తీసిన పెద్దమ్మాయి గుమ్మంలో తండ్రిని చూసీ చూడగానే ముఖమింత చేసుకుని తండ్రి ఇంట్లో కాలు పెట్టకముందే "ప్రోగ్రెస్ కార్డిచ్చారు" అంది ఆనందంగా.

తండ్రి జవాబు చెప్పకముందే "క్లాస్ ఫస్టొస్తే ఎక్స్‌కర్షన్ కి పంపిస్తానన్నారుగా?" అడుగుతోంది.

"ఓ తప్పకుండా. నీకో మంచి ఫ్రాక్ కూడా కొనిస్తాను" అంటుండగానే ఆయన చేతుల్లో కార్డు పెట్టేసింది.

ఎన్ని మార్కులొచ్చాయో కూడా సరిగ్గా చూడకుండా సంతకం చేసేసాడా తండ్రి. పరీక్షలు పిల్లలకా? పరీక్షలంటే తల్లులకేగా. నిద్రకి జోగే పిల్లలు జారిపోయి నేలమీదే నిద్రపోకుండా వాళ్ళ వీపుకి వీపు ఆన్చి కూర్చుని వాలిపోతున్న కనురెప్పలని టీ నీళ్ళతో ఎత్తి నిలబెట్టి మరీ పరీక్షలు రాయించేది తల్లులేగా. ప్రోగ్రెస్ కార్డుపై సంతకాలు మాత్రం తండ్రివి. ఆ ఆనందం, ఆ వైభవం, ఆ సంబరం తండ్రిదేనా?

"నీదేదిరా?" అడిగాను పెద్దాడిని.

ఇవ్వలేదన్నాడు. "ఇవ్వలేదా?" అని తండ్రి అనుమానంగా రెట్టించి అడగ్గానే మరింత బిగుసుకుపోయాడు. బుజ్జగించి, బ్రతిమాలగా మెల్లగా "ఇచ్చారంటూ" పుస్తకాల సంచి నుంచి కార్డు తీసిచ్చాడు. ఇంతకుముందు తొంభై, తొంభై ఐదులు వచ్చిన మార్కులు ఈసారి డెబ్భై, డెబ్భై ఐదున్నాయి.

అదీ సంగతి! మా వాడి కళాహీనమైన కన్నుల వెనకున్న కారణం.

"ఇంతున్నాడో లేదో అప్పుడే అబద్ధాలు. కాస్త జాగ్రత్తగా చూడు. అసలు నువ్వేం చేస్తున్నావ్? పిల్లల్ని సరిగ్గా చూడొద్దా. ఈ అబద్ధాలు అలవాటైతే ఎంత కష్టం. నీ పెంపకం అఘోరించినట్టే ఉంది" ఇంతెత్తున నాపై విరుచుకుపడ్డారాయన.

పెంపెకం!

నా పెద్దక్క అందం, నమ్రత చూసి కాస్త తక్కువ కట్నానికి పెళ్ళికొడుకు దొరగ్గానే 'నా కూతురే' అంటూ గుండెలు చరుచుకున్న నాన్న, చెల్లాయి ప్రేమించిన కుర్రాడిని పెళ్ళిచేసుకుంటానని కరాఖండిగా చెప్పినప్పుడు 'ఆడపిల్లల్ని ఇలాగేనా పెంచటం? ఎల్లవేళలా కనిపెట్టుకుని ఉండొద్దూ. నీ పెంపకం' అంటూ అమ్మపై చేయి చేసుకున్నంత పనిచేశాడు.

"ఏంటలా కూర్చున్నచోటే కూర్చుండిపోయావ్. ఈ పూట తిండేం లేదా?" ఆయన అరుస్తుంటే వంటింట్లోకి వెళ్ళాను.

వెచ్చపెట్టిన చారుగిన్నె పొయ్యి మీదనుంచి కిందకి దించుతుంటే నా చూపు మసిగుడ్డపై నిలిచిపోయింది.

అన్నం వార్చాలన్నా, పొయ్యి మీద గిన్నె దింపాలన్నా, కూరకలుపుతూ, గిన్నె కదలకుండా పట్టుకోడానికి, చేతులు తుడుచుకోడానికి - ఇలా ఎన్నో ఎన్నెన్నో వాటికి మసిగుడ్డ కావాలి.

కాని ఎవరైనా, ఎప్పుడైనా దాన్నో విలువైన వస్తువుగా పరిగణిస్తారా?

వారం రోజులుగా వంటింట్లో పనులు చేసి తన రంగుని, రూపాన్ని పూర్తిగా కోల్పోయిన ఈ మా అమ్మ జాకెట్టు అమ్మని గుర్తుచేస్తోంది.

అహర్నిశలు పిల్లల అవసరాలకి శ్రమించి, ఒంట్లో సత్తువని పిల్లలకి ధారపోసే అమ్మకి ఈ మసిగుడ్డకి తేడా ఉందా?

ఆనాడు నేను మా అమ్మని నిర్లక్ష్యం చేసినట్టు ఈ రోజు నా పిల్లలు నన్ను లక్ష్యపెట్టటం లేదు. ఇదే జానకికి జరిగింది. రేపు జానకి పిల్లలకి, నా పిల్లలకి ఇదే పరిస్థితి ఎదురవౌతుంది.

కాలం మారి ఎన్నో ఆధునిక గృహపరికరాలు ఇంటిని అలంకరించినా వంటింటిలోంచి మాయంకాని మసిగుడ్డలానే ఎంత నాగరిక ప్రపంచం మనచుట్టూ ఆవరిస్తున్నా అమ్మ కష్టాలు ఎప్పుడూ అమ్మవే!

☆ ☆ ☆

కుప్పిలి పద్మ

